పబ్ నిర్వాహకులపై కమిషనర్‌కు ఫిర్యాదు

నిజాంపేట్: రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని అక్రమంగా పబ్‌ను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాచుపల్లికి చెందిన ఆకుల సతీష్ శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ సర్వే నెంబరు 57లోని ప్లాట్ నెంబరు 67/పీలో ఓ వ్యక్తి జీప్లస్5 నిర్మాణం కోసం హెచ్ఎండీ నుంచి రెసిడెన్షియల్ అనుమతులు తీసుకున్నాడని, అందుకు విరుద్ధంగా సదరు భవనంలో రెస్టారెంట్, పబ్‌ను నిర్వహిస్తున్నారని అన్నారు. సదరు భవనాన్ని సీజ్ చేసి రెస్టారెంట్, పబ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం కుల గణన చేపట్టాలి

జగద్గిరిగుట్ట: రాబోయే 2 నెలల్లో కుల గణన జరగాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని డీహెచ్‌పీఎస్(దళిత హక్కుల పోరాట సమితి)రాష్ట్ర అధ్యక్షులు యేసురత్నం అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ డీహెచ్‌పీఎస్ అధ్యక్షులు కత్తుల దుర్గయ్య, కార్యదర్శి కొమ్ము వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో డి రాములు, వి హరినాధరావు, దాసు, వెంకట్, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు. కుల గణన ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



సభ్యత్వాలు అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి

సుభాష్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. శనివారం బహదూర్‌పల్లిలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే రాజ్యాంగం నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. నియోజకవర్గ పరిధిలో 25 వేల నూతన సభ్యత్వాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో కొల్లు మాధవి, శ్యామ్‌రావు, మల్లేష్‌యాదవ్, విజయసాయి, సాధుయాదవ్, నరేంద్రచౌదరి, ప్రసాదరాజు, సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: అన్ని ప్రాంతాలకు స్వచ్ఛమైన జలాలను సరఫరా చేయాలని, సాయినగర్‌లో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్‌రాజు అన్నారు. ఈ మేరకు శనివారం జలమండలి డీజీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయినగర్ ప్రజలు నెల రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిక్షపతియాదవ్, భూపాల్‌రెడ్డి, పావని, సాయి నగర్ పాల్గొన్నారు.

నెల రోజులుగా ఆటో అక్కడే



సంజయ్‌గాంధీ నగర్ రోడ్డులోని దినాలి ఫుడ్ ప్రొడక్ట్స్ ఎదురుగా నిలిపిన ఆటో

రంగారెడ్డినగర్: రంగారెడ్డి నగర్ బస్టాప్ నుంచి సంజయ్‌గాంధీ నగర్ రోడ్డులో ఉన్న దినాని ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమ ఎదురుగా నెల రోజులుగు గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఆటోను పార్క్ చేశారు. సదరు ఆటోకు ఎటువంటి నెంబర్ లేకపోవడంతో అసలు రిపేరు కోసం తెచ్చారా.. లేక దొంగతనం చేసి ఇక్కడ వదిలి వెళ్లారా? అన్నది తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు సదరు ఆటోను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యం కోసం విద్యార్థికి రూ.6 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న ఎంఈఓ జెమినీ కుమారి, యూనిక్ హైస్కూల్ కరస్పాండెంట్ శివయ్య తదితరులు

కుత్బుల్లాపూర్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి చింతల్ సూర్యనగర్‌కు యూనిక్ హైస్కూల్ యాజమాన్యం అండగా నిలిచింది. పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న విద్యార్థి యశ్వవర్ తల సేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించేందుకు తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో పాఠశాల కరస్పాండెంట్ శివయ్య, ప్రిన్సిపాల్ నాగభూషణం రూ. 6 లక్షల విరాళాన్ని సేకరించి చెక్కును ఎంఈఓ జెమినీ కుమారి చేత తల్లిదండ్రులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీనివాస్‌గౌడ్, వరప్రసాద్, ఎంఎల్ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



దుండిగల్: బౌరంపేట్‌కు చెందిన ద ఇంగ్లీస్ స్కాలర్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించిన వైనవి ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంక్‌తో ఎంబీబీఎస్‌లో సీటు పొందింది. శనివారం పాఠశాల ఆవరణలో స్కూల్ కరస్పాండెంట్ కుమ్మరి శ్రీశైలం ఆధ్వర్యంలో ఆమెకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సన్మానించారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ 18వార్డు కౌన్సిలర్ మౌనిక, బీజేపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

19,756 ఎకరాల్లో పంటలు

- 13,788 ఎకరాల్లో వరి, 5,968 ఎకరాల్లో ఉద్యానవన పంటలు
- రైతులకు అవసరమైన విత్తనాలు 7,458 క్వింటాళ్లు, ఎరువులు 4,347 మెట్రిక్ టన్నులపై దృష్టి
- 16,413 రైతులకు రూ.110 కోట్ల రుణాల పంపిణీకి చర్యలు
- యాసంగిలో పంట సాగుకు కార్యాచరణ ఖరారు చేసిన వ్యవసాయశాఖ



సాక్షి,సిటీబ్యూరో: యాసంగి పంట సాగుకు కార్యాచరణ ప్రణాళిక జిల్లా వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 19,756 ఎకరాల్లో వివిధ పంటల సాగు అంచనాతో ప్రతిపాదనలను రూపొందించిన వ్యవసాయశాఖ విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటోంది. యాసంగిలో ఆరుతడి పంట సాగుకు అనుగుణంగా ఉద్యానవన పంటలతోపాటు జొన్న, సజ్జ, శనగ, అపరాలను పండించుకునేలా రైతుల్లో అవగాహన కల్పిస్తోంది.

- జిల్లాలోని 10 మండలాల పరిధిలో పలు రకాల పంటలను సాగు చేస్తారు. జిల్లాలో ఘట్కేసర్, కీసర, మేడ్చల్, శామీర్‌పేట్, దుండిగల్, మేడిపల్లి మండలాల్లో 13,788 ఎకరాల్లో వరి పంటను సాగు చేయనుండగా, జొన్న, మొక్కజొన్న, శనగలు, గోధుమ ఇతర పంటలను 691 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. 5,465 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేసేలా ప్రతిపాదనలు చేశారు. ఇందులో 2,657 ఎకరాల్లో కూరగాయ పంటలు, 2,808 ఎకరాల్లో పండ్లు, తీగ జాతి పంటలు, పూతోటలు రైతులు సాగు చేసేలా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రతి రైతుకు 5 ఎకరాలకు మించకుండా సబ్సిడీ విత్తనాలను సకాలంలో పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో మొత్తంగా 7,458 క్వింటాళ్లకు సంబంధించి వివిధ రకాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. వీటిలో 4455 క్వింటాళ్ల వరి విత్తనాలు, 2,900 క్వింటాళ్ల మొక్కజొన్న, 52 క్వింటాళ్ల జొన్న విత్తనాలను 6 కేంద్రాల ద్వారా సబ్సిడీపై అందజేయడానికి కసరత్తు చేస్తోంది. వ్యవసాయానికి 24గంటల విద్యుత్తు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటున్నారు.

110 కోట్ల పంట రుణాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో 16,413 మంది రైతులకు రూ.110 కోట్ల పంట రుణాలను వివిధ బ్యాంకుల ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

సాగు చేయని భూములకు.. రైతు భరోసా కట్..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 40,960 మంది రైతులకు (పట్టాదారు పాసు పుస్తకాలు) సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో 35 వేల ఎకరాలు, యాసంగిలో దాదాపు 20 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలోని వ్యవసాయ భూముల్లో 50 శాతం భూములు కూడా పంట సాగు నోచుకోవటం లేదని తెలుస్తోంది. అయితే రైతు భరోసా పథకం కింద జిల్లాలో 40,960 మంది రైతులకు సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, వీటికన్నింటికి రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం నిధులిస్తోంది. రైతు భరోసాను పరిగణలోనికి తీసుకుంటే పడావు భూముల (పంట సాగు కాని భూముల)కు కూడా రైతు భరోసా పథకం వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయశాఖ జిల్లాలో సాగు భూమి ఎంత..? పంట సాగు చేయని పడావుగా భూములు ఎన్ని ఉన్నాయన్న విషయంపై ఆరా తీస్తోంది. దీంతో పంట సాగు లేని భూములకు రైతు భరోసా అందజేసే విషయంలో తుది నిర్ణయంపై సర్కారు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

యాసంగిలో రైతులకు అన్నీ అందుబాటులో..



“యాసంగిలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంట సాగుకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచాం. పలు రకాల విత్తనాలను సబ్సిడీపై అందిస్తాం. జిల్లాలో 16,413 మంది రైతులకు రూ.110 కోట్ల పంట రుణాల పంపిణీ లక్ష్యం నిర్ణయించాం.

– చంద్రకళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పోటీపడాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్ మల్లారెడ్డి అన్నారు. జీడిమెట్ల క్రికెట్ గ్రౌండ్‌లో ఎం.వి.రావు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్ విజేతలకు శనివారం ట్రోఫీని, మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వాలీబాల్ ప్లేయర్ భాగ్యారెడ్డి, అకాడమీ నిర్వాహకుడు ఎం.వి.రావు, కుమార్, శ్రీరామ్, విజయ్, బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

జీడిమెట్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చింతల్ మారుతీనగర్‌కు చెందిన ఖరోశిల్లి(70) శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వృద్ధురాలి మనవడు రాజు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



హన్మంతరెడ్డిని సత్కరిస్తున్న క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి రాజీవ్ గాంధీనగర్ క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమకు శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని హన్మంతరెడ్డికి విన్నవించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సర్వే నెంబరు 186లో స్థలాన్ని కేటాయించేలా చొరవ చూపారు. దీంతో శనివారం క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హన్మంతరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జశ్వ, ఎం.చారి, జేమ్స్, శామ్యూల్, జగదేక కుమార్, ఆనంద్, రమేష్, అబ్రహం పాల్గొన్నారు.

- గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో నెల కొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు హన్మంతరెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి బోరు వేయించారు. దీంతో ముస్లిం నాయకులు ఆయన్ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఎండీ లాయక్, ముస్లిం నాయకులు గౌస్ పాషా, జలీల్ ఖాన్, సయ్యద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన వ్యక్తి మృతి

జీడిమెట్ల: పరిశ్రమలో అస్వస్థతకు గురైన వ్యక్తి ఆసుపత్రిలో మృతిచెందాడు. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ కనకయ్య వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన మనుగిరి(36) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి జీడిమెట్లలోని ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ గాజులరామారం డివిజన్‌లోని వివేకానంద నగర్‌లో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి మనుగిరి నైట్ డ్యూటీ నిమిత్తం పరిశ్రమకు వెళ్లాడు. ఉదయం అదే పరిశ్రమకు చెందిన సోనుగిరి కాల్‌చేసి మనుగిరి అస్వస్థతకు గురయ్యారని మనుగిరి బావమరిదికి కాల్ చేసి తెలిపాడు. వెంటనే మనుగిరిని పరిశ్రమ సిబ్బంది షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి బావమరిది ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సుభాష్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం చౌరస్తాలోని సాగర్ హోటల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై శనివారం ఉదయం స్థానికులు ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకున్న వారు అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, అతని వద్ద ఏ విధమైన ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 8712663299 నెంబర్లకు సంప్రదించాలని పోలీసులు సూచించారు.

పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్




సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో భాగంగా శనివారం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో కూకట్‌పల్లి, మేడ్చల్, దూలపల్లి తదితర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించటంతోపాటు పలు సూచనలు చేశారు.

సీబీఐ పేరుతో కేటుగాళ్ల ఫోన్

- గతంలోనూ మీ అమ్మాయిని డ్రగ్స్ కేసులో అరెస్టు చేశామని కాల్
- సీబీఐ అధికారి రకుల్ రాథోడ్ పేరిట శనివారం మరో ఫోన్
- జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు



సీబీఐ పేరిట కాల్ చేసిన వ్యక్తి వాట్సాప్ డీపీలో ఐపీఎస్ అధికారి ఫొటో



తాజాగా వృత్తంలో ఉన్న ఫోన్ నెంబరుతో సీబీఐ పేరిట కాల్ చేసిన ఆగంతకుడు

సుభాష్‌నగర్: ఇటీవలి కాలంలో కొంతమందికి తాము సీబీఐ అధికారులమంటూ ఫోన్ చేసి పలానా కేసులో మీవారిని అరెస్టు చేస్తామని కుటుంబ సభ్యులకు బెదిరిస్తున్నారు. ఆ తరహా కాల్స్ పదుల సంఖ్యలోనే వస్తున్నాయి. వారి వాట్సాప్ డీపీలో సీనియర్ ఐపీఎస్ అధికారుల ఫొటోలు పెట్టుకోవడంతో ఈ ఫోన్ చేసింది నిజమైన అధికారులే అని భావిస్తూ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సూరారం కాలనీకి చెందిన లక్ష్మికి ఇప్పటికే అలా రెండు సార్లు ఫోన్ చేసి కుటుంబ సభ్యులను ఉరుకుల పరుగులు పెట్టించారు కేటుగాళ్లు. ‘సెప్టెంబర్ 11న మేము ఢిల్లీ నుంచి సీబీఐ అధికారులను మాట్లాడుతున్నాం.. మీ అమ్మాయిని డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేశాము. మీరు కూడా రావాల్సి ఉంటుంది’ అని బెదిరింపులకు దిగారు. దీంతో భయపడిన ఆ కుటుంబ సభ్యులు వారి అమ్మాయి చదువుతున్న కాలేజీకి పరుగులు పెట్టారు. కళాశాలలో తమ కుమార్తె క్షేమంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా శనివారం మధ్యాహ్నం 923081881720 నెంబర్‌తో.. సీబీఐ అధికారి రకుల్ రాథోడ్ పేరిట అదే కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వారి అమ్మాయి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు తమ నోటికి పని చెప్పడంతో సదరు వ్యక్తి ఫోన్ కట్ చేశాడు. ఇలా చాలా మందికి సీబీఐ పేరిట ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతూ అందినకాడికి వసూలు చేసుకుంటున్నారంటూ బాధితులు వాపోతున్నారు.

చెత్త కలెక్షన్ పాయింట్‌ను తొలగిస్తారా?

- బస్టాప్ పక్కనే ఉండటంతో దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బస్టాండ్ మధ్యలో చెత్తను సేకరించిన డబ్బాలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాప్‌లో చెత్త కలెక్షన్ పాయింట్ ఏర్పాటుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ నిత్యం వందలాది బస్సులు, ఆటోలు, హమాలీ కార్మికులు, ఇతర వ్యాపార సముదాయాలు ఎప్పుడూ కిక్కిరిసిపోతుంది. ప్రతి రోజూ చుట్టు పక్కల కాలనీల నుంచి కార్మికులు చెత్తను సేకరించి ఆ డబ్బాలను ఈ బస్టాప్‌లో ఉంచుతున్నారు. దీంతో ఇటు ప్రయాణికులు, అటు వ్యాపారస్తులకు తీవ్ర సమస్యగా మారింది. జీవీపీలు ఎత్తివేస్తున్నామని చెప్తున్నా.. ఇలా అభ్యంతకర స్థలంలో కలెక్షన్ పాయింట్‌ను ఏర్పాటు చేయడం ఎంత వరకు సరైందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కలెక్షన్ పాయింట్‌ను ఇక్కడి నుంచి వీలైనంత తొందరగా వేరే చోటుకి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

సాక్షి,సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదాలు నివారించటానికి రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రఘునందన్‌గౌడ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో రోడ్డు ప్రమాదాలు–భద్రతపై డ్రైవర్లు, ఉద్యోగులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఆయన పేర్కొన్నారు. మద్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. మూల మలుపుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, అతి వేగాన్ని అరికట్టాలన్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ధీరేంద్రసామినేని, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్ మోహన్, జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ఉద్యోగులు, డ్రైవర్‌లకు అవగాహన కల్పించటంతోపాటు శిక్షణ కూడా ఇచ్చారు.

హెచ్‌సీయూలో ‘క్లీనప్ డ్రైవ్’

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో శనివారం ‘క్లీనప్‌డ్రైవ్’ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య ఆధ్వర్యంలో వలంటీర్లు క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఆ విభాగం డీన్ ప్రకాశ్ గౌతం, ఫ్యాకల్టీ, విద్యార్థులు కూడా వలంటీర్లతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలు, ఎండు ఆకులు,కలుపు మొక్కలు చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే పరిసరాల్లో ఎండిన దుంగలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంప్‌యార్డ్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్‌సీయూను క్లీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏడాది పొడవునా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో ఎన్ఎస్ఎస్, శానిటేషన్, హార్టికల్చర్ విభాగాలు సమష్టిగా చేసే కార్యక్రమంలో విద్యార్థులు కూడా భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీంసింగ్, వలంటీర్లు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు పూర్తి .. వ్యర్థాలు అక్కడే

- నెలలు గడుస్తున్నా తొలగించని బండరాళ్లు
- పట్టించుకోని కాంట్రాక్టర్, అధికారులు





ఉషోదయ కాలనీలో రోడ్డు పక్కకు పడేసిన బండరాళ్లు

చింతల్ : అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి గాలికి వదిలేశారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ వాటర్ పుష్ కార్యాలయం పరిధిలోని ఉషోదయ సెక్షన్‌లో ఆరు నెలల క్రితం భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ నిర్మాణ పనుల్లో భాగంగా వచ్చే వ్యర్థాలను రోడ్లపై వదిలేసి పత్తాలేకుండా పోయాడు.

పీపీ నగర్‌లో..

ఉషోదయ సెక్షన్ పరిధిలోని పీపీ నగర్‌లో నాలుగు నెలల క్రితం ఓ కాంట్రాక్టర్ పనులు చేపట్టి అక్కడ నిర్మాణ వ్యర్థాలను అలాగే వదిలేశాడు. సంబంధిత సెక్షన్ మేనేజర్, డీజీఎం చూసి చూడనట్లు వ్యవహరించి బిల్లులు మంజూరు చేశారు.



పీపీ నగర్‌లో నాలుగు నెలల క్రితం మరమ్మతులు చేసి వదిలేసిన దృశ్యం..

ఉషోదయ కాలనీలో..

ఉషోదయ కాలనీలో ఆరు నెలల క్రితం భూగర్భ డ్రైనేజీ పైపు లైన్ వేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తవ్వకాల్లో భాగంగా వచ్చిన పెద్ద పెద్ద బండరాలను రోడ్డు పక్కకు వేసి పనులు పూర్తి చేశాడు. పనులు పూర్తయిన తర్వాత సదరు కాంట్రాక్టర్ బండరాలను అక్కడ నుంచి తరలించలేదు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమయ్యారని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బండరాళ్లను ఎక్కడ ఖాళీ జాగా దొరికితే అక్కడే పక్కకు వేశారు. ఒక్కో సెక్షన్ మేనేజర్‌కు ఇద్దరు, ముగ్గురు చొప్పున అసిస్టెంట్లను వినియోగించుకుంటున్నా ఆయా ప్రాంతాల్లో జరిగే పనులను మాత్రం పరిశీలించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బిల్లు చెల్లింపులు పూర్తి!

ఉషోదయ కాలనీ, పీపీ నగర్‌లలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సెక్షన్ మేనేజర్లు, డీజీఎంలు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. రోడ్డు పక్కన వదిలేసిన బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో స్థానికుల పక్కకు వేశారు. అదేవిధంగా మల్లారెడ్డినగర్‌లో పైపులైన్ వేసిన 15 రోజులకే లీకేజీలు తలెత్తుతున్నా బిల్లులు మంజూరు చేయడం గమనార్హం.